క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని జాతీయ రహదారికి తూర్పువైపు అన్ని ప్రాంతాలలో, పడమర వైపు పురుషోత్తమపట్నం, అడ్డ రోడ్డు, శిల్పశాల రోడ్డు, భావనరుషినగర్, సుగాలికాలనీ, ఆది ఆంధ్రా కాలనీ, పండరీపురం ప్రాంతాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా చిలకలూరిపేట మండల పరిధిలోని పసుమర్రు, గుదేవారిపాలెం, మురికిపూడి, రాజాపేట, గోపాళంవారిపాలెం, రామచంద్రాపురం, బొప్పూడి, మానుకొండవారిపాలెం గ్రామాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ కె.రాంబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పిడుగురాళ్లలోని 33 కేవీ సబ్ స్టేషన్‌లో ఏర్పడ్డ అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. త్రీఫేస్ కరెంట్ శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

హిందీ భాషపై అవగాహన ఉండాలి

నరసరావుపేట ఈస్ట్: జాతీయ భాష హిందీపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ప్రపంచ హిందీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ, దేశంలోని ప్రతి ఒక్కరూ వారివారి ప్రాంతీయ భాషతో పాటు హిందీపై అవగాహన కలిగి ఉండటం ద్వారా దేశ సమగ్రత పరిఢవిల్లుతుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, హిందీ విభాగాధిపతి డాక్టర్ ఏ.సరళాదేవి పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్: హిందీ భాషపై పట్టు సాధించడం ద్వారా దేశంలో ఎక్కడైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.పార్వతి తెలిపారు. స్వాతంత్య్రోద్యమ కాలంలో దేశ ప్రజలందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు అనుసంధాన భాషైన హిందీ ఎంతో మేలు చేసిందని తెలిపారు.

దాళ్వా వైపు.. రైతన్న చూపు

- పెరుగుతున్న వరి నారు
- మాగాణి దమ్ముకు సిద్ధమవుతున్న రైతులు


సాగు చేస్తున్న దాళ్వా వరి నారుమళ్లు


దమ్ము చేస్తున్న ట్రాక్టర్లు

రొంపిచర్ల: మండలంలో ఈ ఏడాది సార్వాలో మాగాణి భూముల్లో రైతుల సాగు చేసిన వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో దాళ్వాలో కూడా వరి సాగుచేసేందుకు మొగ్గు చూపుతున్నారు. మొత్తం మీద సార్వాలో ముదురుగా సాగు చేసిన మాగాణి పొలాన్ని తిరిగి దాళ్వా సాగు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. సార్వాలో వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ భూముల కౌలు, పెట్టుబడి పోనూ రైతులకు ఎకరాకు రెండు వేల రూపాయల నుంచి పదిహేను రూపాయల వరకు మిగులు వచ్చింది. వర్షానికి ముందు హార్వెస్టింగ్ చేసిన రైతులు ధాన్యాన్ని రూ.1600 ల నుంచి రూ.1800ల వరకు ధరకు అమ్ముకున్నారు. వారికి రూ.16 వేల రూపాయల వరకు మిగులు వచ్చింది. వర్షం తర్వాత ఒక్కసారిగా ధాన్యం రేటు పడిపోవటంతో బస్తా ఒకటికి రూ.1500ల ధర పలకటం కష్టమైంది. ఈ పరిస్థితుల్లో రెండవ పంటకు కౌలు చెల్లించేది లేదు కనుక దిగుబడి బాగా వస్తే ఆదాయం ఎక్కువగా ఉంటుందని దాళ్వా సాగు చేస్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు.

వర్షం తర్వాత కోతలు నిర్వహించిన వరి పైరుకు అదనపు పెట్టుబడితో పాటు కొద్ది మీర దిగుబడి కూడా తగ్గింది. దీనికి తోడు ధాన్యం రేటు తగ్గటంతో ఆదాయం బాగా తగ్గింది. రెండవ పంట సాగు చేస్తే ఆదాయం వస్తుందని రైతులు ఆలోచనలో దాళ్వా సాగు ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే ముదురుగా వరి సాగు చేసి సార్వా పంట పూర్తి అయిన కొత్తపల్లి, చాకలికుంట, ఎడ్వర్డ్‌పేట, విప్పర్ల, రెడ్డిపాలెం, మర్రిచెట్టుపాలెం, దాసరిపాలెం, మాచవరం తదితర గ్రామాల్లో దాళ్వా వరి నారుమళ్ల సాగు పూర్తి అయ్యింది. వరి నారుమళ్లన్నీ 15 రోజుల నుండి 20 రోజుల వయస్సులో ఉన్నాయి. మరో నాలుగైదు రోజుల్లో వరి నాట్లను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు రైతులు ఇప్పటికే దాళ్వా సాగు చేసే మాగాణి భూమిని ఓ సాలు దమ్ము కూడా చేయించారు.

మిగులు ఉంటుందని...



పునాస సీజన్‌లో ఐదు ఎకరాల్లో వరి సాగు చేశా. వర్షం వల్ల దిగుబడి తగ్గి ధాన్యం రేటు కూడా తగ్గింది. మొత్తం మీద 180 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. 50 బస్తాలు భూమి కౌలు చెల్లించా. మిగిలిన ధాన్యం అమ్మి సాగు అవసరాలకు తెచ్చిన అప్పులు తీర్చా. రూ.20 వేల రూపాయల ఆదాయం వచ్చింది. రెండవ పంట కౌలు లేదు. ఈ సారి ఎక్కువ ఆదాయం వస్తుందని తిరిగి దాళ్వా సాగు చేస్తున్న.

–మునలయ్య, రైతు, విప్పర్ల

బోరుబావుల్లో మోటర్లు చోరీ

- మూడు మోటర్లు, రాగితీగలు మాయం
- లబోదిబోమంటున్న రైతులు


రాగితీగను అపహరించుపోయిన చోరులు

యడ్లపాడు: భూమి పొరల్లో ఉన్న బోరుబావులోని విద్యుత్ మోటర్లను సైతం గుర్తు తెలియని దుండగులు అపహరించుకుని వెళ్లిన సంఘటన మండలంలో జరిగింది. దీంతో చిన్నా, సన్నకారైన రైతులు తమ పంటలకు నీటి తడులు అందించేందుకు వీలు లేక, కొత్తవాటిని కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పారిశ్రామికవాడ బోయపాలెం పరిధిలోని పంటపొలాల్లో మూడుచోట్ల బోరు బావుల్లోని రాగితీగలు రాత్రికి రాత్రే మాయమయ్యాయి. గ్రామానికి చెందిన దగ్గు బైరాగి, ఎలినీడి గోవిందరాజులు, షేక్ బాబు రైతులు కూరగాయలు, ఇతరేత్ర పంటల్ని సాగు చేశారు. ఈ నేపథ్యంలో తమ పంటలకు నీటి తడులిచ్చేందుకు సమీపంలో ఉన్న బోరుబావుల్లో విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేసుకున్నారు. గురువారం రాత్రి 9 గంటల వరకు తమ పంటలకు నీటి తడులు అందించారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు తమ పొలానికి నీరు పెట్టుకునేందుకు వచ్చిన రైతు దగ్గు బైరాగి తన పొలంలోని బోరు ఓపెన్ చేసి కనిపించడం పక్కనే పైపులు పడి ఉండటాన్ని గమనించాడు. వెంటనే ఎలినీడి గోవిందరాజులు, బాబుకు సమాచారం అందించాడు. ముగ్గురి పొలాల్లోని బోర్లు ఊడదీని అందులోని విద్యుత్ మోటర్లు, వాటికి కనెక్షన్లు ఇచ్చిన రాగి తీగల్ని అపహరించుకుని పోయినట్లు గుర్తించారు.

పశువుల పెంపకానికి గోకులం మినీషెడ్‌లు


గోకులం ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

బొల్లాపల్లి: ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగపరచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య అన్నారు. మండలంలోని మూగచింతలపాలెం శివారు గంగులపాలెంలో గరికపాడు, అయ్యన్నపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం గోకులం మినీ షెడ్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్యులు అమీర్‌బాషా, ఏపీవో ఎం.లక్ష్మణరావు, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గోకులం షెడ్డు ప్రారంభోత్సవం

వినుకొండ(నూజెండ్ల): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలని జెడ్పీటీసీ సభ్యురాలు జెడ్డా సుబ్బులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నూజెండ్లలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గోకులం షెడ్లు ప్రారంభోత్సవం చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ వెంకటస్వామి, ఏపీవో ఆంజనేయ రాజు, మాజీ జిల్లా పశుసంవర్ధకశాఖ చైర్మన్ లగడపాటి వెంకట్రావు,మాజీ సొసైటీ అధ్యక్షులు గంగినేని ఆంజనేయులు, లగడపాటి సూరిబాబు, గంగినేని బ్రహ్మనాయుడు రైతులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో ఉపాధి పథకం నిధులతో నిర్మించిన గోకులం షెడ్డు ప్రారంభోత్సవం కార్యక్రమం ప్రజాప్రతినిధులు అధికారులు శుక్రవారం నిర్వహించారు.

ఇచ్చిన హామీలు అమలు చేయండి

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ డిమాండ్


వినుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



నరసరావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరుపేదలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఇళ్లు లేని వారి వద్ద నుంచి అర్జీలు సేకరించి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయడం జరిగింది. ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేసి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు. తిరుపతి ఘటనలో చనిపోయిన వారికి వెంటనే ఎక్స్ గ్రేషియా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉలవలపూడి రాము, బూదాల శ్రీనివాసరావు, పఠాన్ లాల్‌ఖాన్, వెంకటేశ్వర్లు, పవన్ కుమార్, రాయబారం వందనం, కిషోర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: కూటమి ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, పట్టణ కార్యదర్శి ఉప్పలపాటి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అసిస్ట్ సేవా ప్రస్థాన స్వర్ణోత్సవ వేడుకలు

చిలకలూరిపేట: ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ అసిస్ట్ ఇండియా సేవా ప్రస్థాన స్వర్ణోత్సవ వేడుకలు శని,ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వడ్లమాని రవి తెలిపారు. అసిస్ట్ సంస్థ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ఆపరేషనల్ డైరెక్టర్ డాక్టర్ జాష్టి రంగారావు ఆధ్వర్యంలో స్థాపించబడి 50 ఏళ్లుగా సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పలువురు ఎమ్మెల్యేలు, ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

విజయమే పరమావధిగా కృషి చేయాలి

మాజీ మంత్రి విడదల రజిని



చిలకలూరిపేట: పార్టీని విజయ తీరాలకు చేర్చటమే లక్ష్యంగా పని చేయాలని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి శుక్రవారం చిలకలూరిపేటలోని మాజీ మంత్రి విడదల రజిని నివాసానికి విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయనను విడదల రజిని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిందని గుర్తు చేశారు. అదే సమయంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. ప్రజలు తిరిగి ఎప్పుడు జగనన్న ప్రభుత్వం వస్తుందా అని ఎదురు చూస్తున్నారని, ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



నాదెండ్ల: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. తూబాడు, సాతులూరు గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన గోకులం షెడ్లను కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. సాతులూరు గ్రామంలో ఈదర కృష్ణ, బండారుపల్లి యల్లమందరావు, తూబాడు గ్రామంలో సిరిబోయిన కోటయ్య, షేక్ చినఖాజావలి గోకులం షెడ్లను నిర్మించుకున్నారు.

ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ, వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను ప్రోత్సహించే లక్ష్యంతో రూ.2.30 లక్షలతో నిర్మించిన ఒక్కో షెడ్డుకు గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 90 శాతం సబ్సిడీ అందించినట్లు తెలిపారు. గేదెలు, మేకలు, కోళ్ళ పెంపకం ద్వారా అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ పథకాలను రైతులు, యువత, మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, రైతులు ఈ షెడ్ల ద్వారా అదనపు ఆదాయం పొందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో స్వరూపరాణి, ఏపీవో రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, జనసేన కన్వీనర్ తోట రాజారమేష్, సదాశివ రావు పాల్గొన్నారు.

ముక్కోటివాసా... గోవిందా

- ఘనంగా ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు
- ఉత్తర ద్వారంలో వైకుంఠవాసుడిని దర్శించి తరించిన భక్తజనం
- ఆలయాలు కిటకిట


శ్రీ సీతారామస్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ


నరసరావుపేటలో శ్రీరాధగోవిందులు


వంకాలయపాడు వేణుగోపాలస్వామి..


గ్రామోత్సవానికి సిద్ధమైన గరుడవాహనం


బోయపాలెం వెంకటేశ్వరస్వామి


సొలసలో రంగనాయక స్వామి

నరసరావుపేట: పవిత్ర ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బరంపేటలో గల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు శంకర్ నారాయణ, వేముల శివ, హనుమంతరావు, ఈపూరి రామిరెడ్డి పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ పూజలు ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శ్రీనివాస నగర్‌లోని శ్రీ లక్ష్మీసమేత వెంకటేశ్వరస్వామి, ప్రకాష్ నగర్‌లోని శ్రీ అభయ వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శావల్యాపురంలో....

శావల్యాపురం: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. మండలంలోని వేల్పూరు,మతుకుమల్లి, పొట్లూరు, శావల్యాపురం, కారుమంచి తదితర గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి పర్వదినం వేడుకలు భక్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు.

నూజెండ్ల మండలంలో...

వినుకొండ(నూజెండ్ల): వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని మండలంలోని నూజెండ్ల, గురప్పనాయుడుపాలెం, కమ్మవారిపాలెం, రవ్వారం, తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో ఘనంగా వేడుకలు శుక్రవారం నిర్వహించారు.

ఉత్తర ద్వారదర్శనం.. సర్వపాపహరణం

యడ్లపాడు: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లోని స్వామి వారు ఉత్తర ద్వార దర్శనంలో శుక్రవారం భక్తులను అనుగ్రహించారు. ఉదయం 5.30 నుంచి 9:30 వరకు ఆలయ అర్చకులు ఉత్తర ద్వార దర్శన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సొలస గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భూసమేత రంగనాయకస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు, గ్రామ పెద్దలు హాజరైయ్యా రు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి

నాదెండ్ల: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని వైష్ణవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు, ఉత్తర ద్వార దర్శనం భక్తిశ్రద్ధలతో జరిగాయి. గణపవరంలోని నూతన కోదండరామాలయంలో ఉదయాన్నే స్వామివారికి అలంకరణ, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారులు దర్శి అనిల్‌కుమార్, ఉమామహేశ్వర శర్మలు గోత్రనామ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేశారు. ఉదయం 4.30 గంటల నుండే భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 11 గంటల నుంచి స్వామి వార్లను పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు కెల్లంపల్లి సుందరరావు, సభ్యులు కెల్లంపల్లి అచ్చయ్య, గాలిబుచ్చయ్య, ఐతా శ్రీనివాసరావు, సింగు సత్యనారాయణ, కాటా వెంకటేశ్వర్లు, రత్తయ్య పాల్గొన్నారు.


గణపవరంలో స్వామివార్ల గ్రామోత్సవం

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని వైష్ణవాలయాలలో స్వామివారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. ఆయా ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో స్వామివారు ఉభయ దేవేరులతో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శ్రీపాండురంగస్వామి ఆలయంలో గరుడ వాహనంపై శేషశయన అలంకరణలో దర్శనమివ్వగా, బరంపేటలోని శ్రీరాధ గోవింద చంద్రమందిరం ఇస్కాన్‌లో మూలమూర్తులను ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీసీతారామస్వామి ఆలయం, శ్రీలీలా వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం తదితర ఆలయాలలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించి భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని అన్ని వైష్ణవి ఆలయాలు ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం తెల్లవారుజాము నుండే భక్తులతో నిండాయి. భక్తులు ఉత్తర ద్వారం గుండా ఆయా దేవాలయాల్లోని దేవతా మూర్తులను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి రోజు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మహావిష్ణువును ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకుంటే తమకు అన్ని శుభాలే జరుగుతాయని భక్తుల నమ్మకం. ఏకాదశి రోజున ఉపవాసంతో ఆ నారాయణుని తలచుకుంటే సంవత్సరంలోని 24 ఏకాదశిలకు వచ్చినంత పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. తెల్లవారుజామునే స్నానాలు ఆచరించి భక్తులు ఉత్తర ద్వారం గుండా దర్శనాలు చేసుకున్నారు. సంతగుడిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి, రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం, విప్పర్ల, కొత్తపల్లి, విప్పర్లపల్లి తదితర గ్రామాల్లో ఉన్న రామాలయాలు, హనుమంత ఆలయాలలో భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.

సంక్రాంతి సంబరాలు

ఎంఏఎం కళాశాలలో భోగిమంటల వద్ద విద్యార్థులు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



ఎఎంరెడ్డి కళాశాలలో భోగిమంటలు వెలిగిస్తున్న కార్యదర్శి



నరసరావుపేట పరిసరాల్లోని పలు పాఠశాలలు, కళాశాలల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. భోగిమంటలు వెలిగించి సంబరాలను ప్రారంభించారు. రంగవల్లులు, బసవన్న ఆటలు, బొమ్మల కొలువులు, హరిదాసు కీర్తనలు ఏర్పాటు చేశారు. యువతులు సాంప్రదాయ వస్త్రధారణతో సంబరాల్లో పాల్గొన్నారు. భోగిమంటలు వద్ద నృత్యాలు చేస్తూ సందడి చేశారు. రంగోలి పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు వక్తలు తెలిపారు.

–నరసరావుపేట రూరల్

బల్లబళ్లు అందజేత

నరసరావుపేట: చెత్తను సేకరించే వర్గీయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి వారి అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి, అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ఏకా మురళి సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌ఎస్) సమకూర్చిన బల్ల బళ్ళు, రిక్షాలను వేస్ట్ పికర్స్‌కు డీఆర్వో మురళి అందజేశారు.